# విచిత్ర విలాపం

" విశారధా ! మనకు ఈ ఇల్లు ఒకటి చాలుగదూ!" ముద్దుగా అడిగాడు విచిత్రకుమార్ .

" ఏం ఇంకొకటి కొంటున్నారా?" విశారద అడిగింది ఆసక్తి కనబరుస్తూ ఎందుకంటే విచిత్రకుమార్ చెప్పింది చెయ్యడు - చేసేది చెప్పడు. మొదటి సారిగా - కాపురానికొచ్చిన మొదటి సారిగా అతను సలహా అడుగుతున్నాడు తనను. తనేదైనా సలహా యివ్వక పోయే నాకు తెల్సులే అంటాడు మొహం మీద గుద్దినట్లు.

" కాదు - అమ్ముదామనుకొంటున్నాను." చెప్పాడు.

" మనం ఎక్కడుంటామండి? అద్దె కొంపల అగచాట్లు మీకు తెలియనివి కావు - వసతులుంటే వాస్తు అస్సలుండదు. వాస్తుంటే వసతులుండవు వాస్తు - వసతులు ఉంటే - ఇరుగు పొరుగు బాగుండదు." బిక్కమొహంతో అంది.

" పిచ్చిదానా ఈ ఇల్లు కాదే .. మన ఊర్లోని ఇల్లు."

" అరె ! మనకి మనూర్లో ఇల్లు ఉందా?" ఆశ్చర్యపోయింది.

" ఈ మధ్య అఘోరించానులే అగ్గువగా వస్తూ ఉంటే - కాని అదేం ఖర్మో కొన్నప్పటి నుండి అన్నీ ఎదురు దెబ్బలు - పక్క దెబ్బలు తగలడానికి !" లాపాయింటు లేవదీసింది లతాంగి.

" నీ కర్థం కాదులే - మనం కాపురం ఉండఖ్కరలేదు - డాక్కుమెంటు మన పేరున ఉంటే చాలు - దాని ప్రభావం చూపిస్తుంది." చెప్పాడు.

" అదెట్లా గబ్బా !" నోరు తెరిచింది ఆశ్చర్యంతో

" అదంతే ! మనం దొంగతనం చెయ్యక పోయినా - మన అబ్బాయి దొంగతనం చేస్తే - ఆ ఫలితం మనం కూడ అనుభవిస్తాంగా - అలా !"

" ఓ ! సరే - ఎంతకమ్ముదామని - ఏం చేద్దామని?" అడిగింది.

" ఛస్ ! అవన్నీ నీకెందుకు ? ఆడ వాళ్ళకు ఆస్థి వ్యవహారాలు ఎందుకు ? ఏదో చేస్తాను. అమ్మి పారేసి ఆ డబ్బును ఏ బ్యాంకులోనో ఫిక్సుడు చేసి పారేస్తాను - లేదా ఓ యల్లైసి పాలసీ కొని పారేస్తాను."

" అలా చేయండి - యల్లైసీ బెస్టు - "

" ఏంటే - నే తొందరగా చావాలని నీక్కూడ కోరిక ఉందా?"

" అయ్యో రామా ! నేనామాట అన్నానా - అమంగళం అప్రతిహత మవుదువు గాక " మంగళ సూత్రాలు కంటికి అద్దుకుంది భక్తిగా.

" మరి జీవిత భీమా ఎందుకు చెయ్యమన్నావే భామ? నే చావాలనేగా ?" కోపంగా అడిగాడు ఆమె జాకెట్టు లో దాచుకున్న మంగళ సూత్రాలను చూస్తూ.

" అబ్బే ! అది కాదండి - ఈ మధ్య ఏజెంట్లు తెగ తిరిగి పోతున్నారు. కాస్త వాళ్ళ బాధ తప్పుతుందని. లేక పోతే ప్రతి తలమాసిన వాడికి సమాధానం చెప్పలేక చచ్చి పోతున్నా!" తన బాధ వివరించింది విశారద.

విచిత్ర కుమార్ విచిత్రంగా తలజుత్తు పీక్కున్నాడు శ్వాస ఎగ పీల్చాడు.

" నీ కోరికెందుకు కాదనాలి ! పాపం ! చివరి కోరిక - ఓ పాలసీ చేసి నా పాపానికి నేను పోతాలే !" అభయమిచ్చాడు కృష్ణపరమాత్మలాగా

విశారద కళ్ళెంబడ నీళ్ళు కారాయి. ముక్కు చీదింది. పయిటతో తుడుచుకుంది.

" ఒసే ! అప్పుడే ఏడుస్తావేంటే ! నేనింకా పాలసీ చెయ్యలేదు - పోలేదు - ఆ డబ్బులు నీకు రాలేదు - " ఓదార్చాడు - ఆమె తొందరపాటుకు నొచ్చుకుంటూ.

" అది కాదండి - చివరి కోరిక అంటున్నారు - ఇంక నేనెప్పుడూ ఏదీ అడగకూడదా? - నా కింకా ముప్పయ్యేళ్ళ ,వయస్సే గదా అయింది. అరవై ఏళ్ళు బ్రతుకు తాననుకున్నా - ముప్పయ్యేళ్ళు ఏమీ అడగకూడదా?" సందేహంతో దేహాన్ని ఊపుతూ అడిగింది విశారద కళ్ళు విశాలం చేసి.

" పిచ్చిదానా ! నువ్వు అడక్కూడదని కాదే --- వినడానికి నేనుండనే - తీర్చడానికి నేనుంటేగా?" చిన్నగా అన్నాడు అక్కినేని ఫోజు యిస్తూ.

" ఏమండీ ! ఇంత చిన్న వయసులో సన్యాసుల్లో కల్సిపోతున్నారా? లేదా విదేశాలకు తరలి పోతున్నారా మమ్మల్ని వదిలి!" విశారద వినయంగా - విస్మయంగా - వింతగా అడిగింది.

" నిన్ను ఇరగదియ్యా ! ఆ మాట ఎవరు చెప్పారే ! పాయసంలో పడ్డ ఈగ బయటకు రాగలదా? నా బ్రతుక్కు ఓ సన్యాసి యోగం కూడాను? ఓహో ! మళ్ళీ విదేశ యోగం కూడాట! ఆహా ! విచిత్ర కుమార్ నీ గురించి లోకం ఏమనుకుంటున్నది! అస్సలు నేనెలా కనిపిస్తున్నానే నీకు ?" తల బాదుకుంటూ అడిగాడు – ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

" మనిషిలా ! " చెప్పింది ఠక్కుమని విశారద.

" థ్యాంక్సు ! గాడిదలా కనిపిస్తున్నానని అంటావనుకున్నా – "

" అమ్మ వారి వాహనాన్ని అవమానం చెయ్యొద్దు – అసలే దసరా సరదాగా చేసుకుంటున్నాము ఆ అమ్మ దయవలన" చెప్పింది.

" ఒసే – నా ఫేసుకున్న వాల్యూ అంతే అన్నమాట ! ఇంత అమాయకురాలివి నే పోయింతర్వాత ఎలా బ్రతుకు తావో అని – ఉన్నవన్నీ అమ్మి బ్యాంకులో పారెయ్య దల్చుకున్నా !" చెప్పాడు.

" అవయవ దానం చేస్తారా! కిడ్నీలు – కళ్ళు – లివరు – చర్మం – ఇంకా – ఇంకా ఈ మధ్య పేపరులో చదివాను" చెప్పబోయింది.

" నీ జీ.కె.కి – నా ఓ.కే ! నేనమ్మేది నన్ను కాదు – నా ఆస్థి పాస్తుల్ని – అస్సెట్లను – ఎవడి కన్నా యివ్వాల్సి ఉంటే యిచ్చేసి – మిగతాది ఎక్కడోక్కడ తగలేస్తా విశారదా! " చెప్పాడు విచిత్రకుమార్.

" అయినా ఈ దురాలోచన మీకెలా వచ్చిందండీ !?" ఆశ్చర్యంగా అడిగింది.

" దురాలోచన కాదే సులోచనా అది దూరాలోచన దుర్గా !" జాలిపడ్డాడు.

" చాల్లేండి వెక్కిరింత – ఈ కాలం కళ్ళద్దాలు ఎవరికి లేవు – కాస్త బొద్దుగా ఉన్నంత మాత్రాన – దుర్గ అని పేరు పెట్టావా? " అలిగింది నీలవేణి.

" నీ అలకలు కులుకులు తర్వాత – ఇదీ మనం కలిసి చేసుకునే చివరి పండుగ – దీపావళి చేసుకుంటావో లేదో!" బాధగా అన్నాడు కాలరు పట్టుకుని.

"ఏం ఊళ్ళో ఉండటం లేదా!" విచిత్రంగా చూసింది విచిత్ర కుమార్ వంక

" కాదే – ఉష్ ! కాకి ! హంస ఉంటుందో , ఊడుతుందో !" చెప్పాడు.

" మీ కేమండి దిబ్బరొట్టెలాగా దుబ్బగా ఉన్నారు. తిండి పుష్టి చెప్పక్కర లేదు. నాలుగు కంచాలు అవలీలగా మాయం చేస్తారు. పుట్టినప్పటి నుండి ముక్కు చీదిన పాపాన పోయినట్టులేదు. పెళ్ళయినప్పటి నుండి జొరం వచ్చికూడ చూడలేదు. అందులో సామెత ఉండనే ఉందిగా అండి – మీకేం భయంలేదు." లాజికల్‌గా రీజనింగ్ యిచ్చింది.

" అవునే – సామెత అన్నావు – మేత మొహం దానా – ఏంటో చెప్పు?" సాలోచనగా అడిగాడు – బుర్రగోక్కుంటూ.

" బావుండదులేండి – మీరేం దిగులు పడకండి – నా ఆయుష్షు కూడ పోసుకుని పది కాలాల పాటు బ్రతకండి." లోపలికి పోబోయింది.

" ఇంతకీ సామెత ఏంటో చెప్పి ఏడు." ఏడ్పు మొహంతో అడిగాడు.

" ఆ ! ఏముంది – పుణ్యాత్ములు తొందరగా పైకి పోతారు కాని పాపే చిరాయువు అన్నట్లు – మీ లాంటి మొండి ఘటాలు మటుకు – "

" నోర్ముయ్ ! లోపలికి పోయి నీ పని చూసుకో – నోరు లేస్తున్నదే – నేనింకా బ్రతికే వున్నా – ఎముకలేరేస్తాను జాగ్రత్త !" హెచ్చరించాడు.

ఇంతలో స్కూలు నుండి బుజ్జి, చిట్టి వచ్చారు. బుజ్జి యుకెజి, చిట్టి యల్‌కెజి చదువుతున్నారు – కాని వాళ్ళ వీపులకు కేజీల కేజీల పుస్తకాల మోత వుంది. బియ్యపు బస్తా మోసే కూలిలాగా ముందుకు వంగి పోయి వున్నారు. వాళ్ళను చూడగానే బావురు మంది విశారద.

" ఏం పొయ్యేకాలమే – ఏడుస్తున్నావు ?" కోపంగా అడిగాడు.

" చూడండి వాళ్ళు ఎలా వంగి పోయారో పుస్తకాల మోతకు?"

" అయితే ఏం చెయ్యమంటావు – బడి మాన్పించమంటావా?"

" కాదండి – అవి మొయ్యడానికి ఓ నౌకరును ఏర్పాటు చెయ్యండి" సలసా యిచ్చింది.

" కాదే – వాళ్ళు భావిభర్తలు – భరించు వారు భర్తలు – జీవిత భారాన్ని

మోయడానికి ఇప్పటినుంచే శిక్షణ యిస్తున్నారు మన విద్యామండలి వాళ్ళు" నచ్చ చెప్పాడు ఆమెకు.

" నాన్నా నాన్నా ! రేపు వందరూపాయలు ఫీజు తెమ్మన్నారు" చెప్పాడు బుజ్జి - అతన్ని వాటేసుకుంటూ.

" అమ్మా ! నాక్కూడ డబ్బులు కావాలే !" అంటూ చిట్టి ఆమెను చుట్టేశాడు గారాబంగా.

" ఛీ ! ఛీ ! వీళ్ళ యిల్‌కెజి ఖర్చుతో నా చదువు మొత్తం పూర్తయి పోయింది. ఇంక వీళ్ళు కాలేజీ చదువులు చదివితే ఏం తాకట్టు పెట్టాలో, ఎవరిని అమ్మాలో అర్థం కాకుండా వుంది." విసుక్కున్నాడు విచిత్రకుమార్ .

" అందుకే మీ తెలివి తేటలు ఇలా ఏడుస్తున్నాయి - వీళ్లు కంప్యూటర్ కుర్రాళ్ళు - " సాగదీసింది విశారద.

" ఆహా ! రేపు నే పోయింతర్వాత నువ్వెలా నెట్టుకొస్తావో నే చూడకుండా పోనులే -" కసిగా అన్నాడు.

" పిల్లల ముందు పాడు మాటలేంటి - బాగుండదు - మీరు కూడా స్నానం చేస్తే కాస్త మింగి పడుకోవచ్చు" నచ్చ చెప్పింది అతని కోపాన్ని చల్లారుస్తూ.

" అంతేలే ! ముక్కు వున్నంత వరకు చీమిడి తప్పదు - జీవుడున్నంత వరకు ఆకలి తప్పదు" అంటూ లేచాడు విచిత్రకుమార్ బాతురూముకు.

మరునాడు సరిగా తెల్లవారిందో లేదో ఎవరో తలుపు బాదుతున్నారు ... విచిత్రకుమార్ ఇంకా మొద్దు నిద్రలో వున్నాడు - పాలవాడు అప్పుడే తగలడ్డాడా అని బాధపడ్తూ లేచింది విశారద.

దుస్తులు సర్దుకుని తలుపు తెరిచింది.

ఎదురుగా సఫారిలో ఠీవిగా యికిలిస్తూ ఓ అపరిచిత వ్యక్తి -

" ఎవరు కావాలి ?" కంగారుగా అడిగింది.

" సారున్నారా?" అతను అడిగాడు.

" ఆయనతో ఏం పని? " ఆశ్చర్యబోతూ అడిగింది.

" పాలసీ రాస్తానన్నాడు" చెప్పాడు.

" పాచి మొహంతో పాలసీ రాస్తానన్నాడా? సరిగ్గా విన్నారా?" అడిగింది.

" అదేమో తెలియదు కాని - సంతకాలు పెట్టేస్తే ఒక పని అయిపోతుంది!" చెప్పాడు అతను.

" ఇంతకీ మీరెవరు ? పని కావడమేంటి?" కంగారుగా అడిగింది.

" నేనే మీకు తెలియదా? ఈ ఊరేనా మీది?" ఆశ్చర్యపోయాడు అతడు.

" అదేంటి మీరేమన్నా మన ప్రధానా? ముఖ్యమంత్రా-టీవీలో అదేపనిగా చూడ్డానికి కనీసం యాంకరు కూడా కాదనుకుంటా?" మరి నాకెలా తెలుస్తుంది? అస్సలు యిప్పుడు టైమెంతయింది?" అడిగింది.

" అయిదు కావడానికి యింకా అరగంట వుంది. 'ఐదులోపు వస్తానని చెప్పా - ఐదయితే వెళ్ళి పోతానన్నాడు ! నా పేరు మాలకొండయ్య - యల్లైసీ ఏజెంటును - మీరు పక్కకు జరిగితే లోపలికొచ్చి కూర్చుంటా!" చెప్పాడు అతను. చీకటిని శిల్పంలా చెక్కినట్లున్నాడు మాలకొండయ్య.

" అరే ! ఆయన ఐదు లోపు రమ్మన్నారా? ఐదు దాటితే వెళ్ళి పోతానన్నారా? మాకు పెళ్ళయినప్పటినుండి ఆయన ఏడులోపు నిద్రలేవడం నేచూడలేదే! చాలా వింతగా వుంది." ఆశ్చర్యపోయింది విశారద విశాల నేత్రాలతో.

" ఫర్లేదు లేచే దాకా వేచి ఉంటాను." చెప్పాడు మాలకొండయ్య.

" వద్దు - ఏడు తర్వాత రండి అంతగాయితే - " చెప్పింది విశారద.

" అయితే వరండాలో ఉంటాను - " వదలడం లేదు అతను.

" అబ్బ ! ఇంక మీకు వేరే పన్లేం ఉండవా? " విసుక్కుంది విశారద.

" మా పనే ఇది. ... ఎవరు పాలసీ యిస్తానంటే అక్కడికి రావడమే!"

" మంచిది - మళ్ళీరండి - నిద్ర వస్తున్నది" అంటూ అతని మొహాన ధడాల్న తలుపు వేసింది. మళ్ళీ ముసుగుతన్ని పడుకుంది కాసేపు.

బాగా తెల్లవారింది.

విచిత్రకుమార్ మొహంకడిగి కాఫీ తాగుతుండగానే మాలకొండయ్య లోపలికి వచ్చేశాడు.

" నమస్తే సామీ ! బాగున్నారా!" రెండు చేతులు జోడించి అడిగాడు.

" బాగుంటే నీ కెందుకు కబురు చేస్తానయ్యా ! ఏంటి ఇంత ఆలశ్యంగా వచ్చావు." గుర్రుగా అడిగాడు విచిత్రకుమార్. ఏజెంటు అంటే అందరికీ లోకువే!

" మీ ఆవిడ చెప్పలేదా - పొద్దున్నే వచ్చా - మీరు నిద్రోతున్నారు - ఇంతకీ ఎంత చేద్దామనుకుంటున్నారు - ఐదా - పదా - ఇరవయ్యా - ముప్పయ్యా - యాభయ్యా - " సూట్‌కేసు ఓపెన్ చేసి కాగితాలు బయటకు తీశాడు - మాలకొండయ్య.

" ఏంటి వేలా - ఏమయ్యా - నా ప్రాణానికి అంత కంటే విలువ లేదా?" అసహనంగా అడిగాడు విచిత్రకుమార్.

" కాదండి - లకారాలు - కోటి చేస్తానన్నా అభ్యంతరం లేదు - కాక పోతే సంవత్సరానికి ఆరేడు లక్షలు కట్టాల్సి వస్తుంది కంతు."

" పాలసీ డబ్బులు మా ఆవిడకే రావాలయ్యా ! మళ్ళీ అప్పులాళ్ళు కాని - బంధువులు కాని - రాబందువులుకాని కొట్టెయ్య కూడదు ఆ !" హెచ్చరించాడు విచిత్రకుమార్ - విశారద వంక ప్రేమగా చూస్తూ.

" అందుకే గదా - మీ ఆవిడ పేరు నామినీగా పెడదాం-"

" అయ్యోరామ ! నామినీ లాభం లేదు - అస్సైనీగా చెయ్యాలి - లేదా యమ్ డబ్లుయూ యాక్టు కింద చెయ్యాలిట." విశారద వచ్చి చెప్పింది.

" ఏదో ఒకటి చేస్తాడు లే ఇంతకీ ఎంతకు రాస్తావు ? కనీసం యాభై రావాలి ! గిట్టుబాటు ఎక్కువ కావాలి - ప్రీమియం తక్కువుండాలి. "

" తమరు ఎంత కడదామనుకుంటున్నారు సంవత్సరానికి ?"

నేను కట్టేది ఎముందిలే - ముందు కంతు నువ్వు కట్టు - బ్రతికి వుంటే ఆలోచిద్దాం - ఒక వేళ పోతే వచ్చిందాంలోంచి మా ఆవిడ నీ డబ్బులు నీకిస్తుంది-" వివరించాడు విచిత్రకుమార్.

చాలాసేపు బేరసారాలు జరిగాయి – ఓ రెండు గంటల తర్వాత పాతికలక్షల పాలసీ రాసేసి – ఓ చెక్కు యిచ్చాడు విచిత్రకుమార్.

మాలకొండయ్య వెళ్ళిన తర్వాత భోజనానికి కూర్చున్నారో లేదో – సార్ అంటూ యింకోడు తయారయ్యాడు, విశారదకు విసుగొచ్చింది.

" ఎవరయ్యా! ఏం కావాలి " కరుగ్గా అడిగింది.

" సార్ – ఇల్లు అమ్ముతున్నారు – " అంటూ లోపలికి వచ్చాడు బ్రోకరు.

" గయ్ మన బోతున్న విశారదను వారించి అతన్ని పక్కకు తీసుకుపోయి మాట్లాడాడు. కొన్ని డాక్యుమెంట్ల జిరాక్సు కాపీలు అందించాడు. తను ఎంత చెప్పేది చెప్పాడు.

" చూడబ్బా ! రెడీ క్యాష్ యిచ్చే పార్టీలుంటే చెప్పు. ఓ వారంలోగా అయిపోవాలి రిజిస్ట్రేషను " చెప్పాడు.

" మాగ్జిమమ్ ట్రై చేస్తాసార్ –" అని చెప్పి బ్రోకరు ఎర్రన్న వెళ్ళి పోయాడు ఆ కాగితాలు పట్టుకుని.

" అరే ! నేను మీకేం ద్రోహం చేశానండి – అన్నీ అమ్మేస్తున్నారు?" కళ్ళనీళ్ళు పెట్టుకుంది అతన్ని చుట్టేసి.

"అందుకేనే ? ఒంటరి ఆడదానివి బాధలు పడకూడదనే మనకున్న స్థలాలు అమ్మి పారేస్తున్నా – వాటిని ఎవడన్నా ఆక్రమించినా నీకు తోలడం చేతకాదు–" చెప్పాడు తన భయం.

" మీరున్నారు కదండి నాకేం బాధ !" ధీమాగా చెప్పింది.

" సరిపోయింది – ఆయనే ఉంటే మగవాడు మాట వినడా అన్నట్లుంది– నేనుంటే నీకెందుకు ఈ కష్టాలు –" సాలోచనగా అన్నాడు.

" ఏవండీ – మీరు నాదగ్గర ఏదో దాస్తున్నారు – అసలేం జరిగిందండి – డాక్టరు మీకేం చెప్పాడు? క్యాన్సరా? ఎయిడ్సు వచ్చిందా? హెపటైటిస్ – బి వచ్చిందా? అసలేం జరిగిందండి? ఎందుకండి ఈ మధ్య విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు?" వల వల ఏడ్చింది.

" ఛ ! ఛ ! నీ దయవలన నాకు ఎయిడ్సు కాని - క్యాన్సరు కాని - హెపటైటిస్ - బి కాని ఏవీ లేవు." కంగారుగా చెప్పాడు.

" మరి ఎందుకు ఇలా దిగులు పడుతున్నారు?"

" పిచ్చిదానా - 'జాతస్యహి ధ్రువో మృత్యుః ' అన్నారు కదే పెద్దలు పుట్టిన వాడు గిట్టక మానడు - గిట్టిన వాడు పుట్టక మానడు. విశారదా! వివేకవంతుడు ఈ చావు పుట్టుకల గురించి విచారించడు" గీత బోధించాడు - విచిత్రకుమార్.

" మరి అది తెల్సి ఎందుకు ఇంత కక్కుర్తి పడి లంచాలు మేసి తెగ సంపాదిస్తున్నారు? " కోపంగా అడిగింది విశారద.

" ఓసీ పిచ్చిదానా ! బుద్ధిమంతుడు చచ్చేదాకా సంపాదించాలి !" నచ్చ చెప్పాడు - విచిత్రకుమార్.

" ఇవన్నీ కట్టుకు పోతారా?" విశారద అనుమాన నివృత్తి కోసం అడిగింది.

" అయ్యో ! పూచికపుల్ల కూడ నావెంట రాదు - ఆఖరికి నేను పెంచి పోషించిన ఈ కాయం కూడ మాయం అవుతుంది అగ్గిలో పడి."

విచిత్రకుమార్ విచారంగా చెప్పాడు విశారదను వాటేసుకుని.

" మరి ఇంత తెల్సి ఎందుకు ఇలా ఆస్తి తగలేస్తున్నారు?" ప్రశ్నించింది.

" అదీ ఒక మాయేనని తెల్సు - తెలిసీ వలచీ విలపించుటలో తియ్యదనం ఎవరికి తెలుసు అని ఒక కవి అడిగాడు తెలుసా?" అడిగాడు విచిత్రకుమార్ .

" మహానుభావా ! ఇవ్వాళ మనం డాక్టరు దగ్గరికి పోదాం - మీ పనులన్నీ మానుకోండి ." విశారద తీర్మానించింది.

" డాక్టర్లేం దేముళ్ళు కాదే - వాళ్ళ పిల్లాళ్ళకు సీరియస్సు అయినా ఏం చెయ్యలేరు - దేముళ్ళకు ముడుపులు కట్టుకుంటారు." తేలిగ్గా చెప్పాడు.

" మరి వైద్యం ఎందుకు చేయిస్తారు అంత డబ్బులు తగలేసి?"

" మానసిక ధైర్యం కోసం - వీళ్ళిచ్చే మందుతో జబ్బు తగ్గుతుందనుకున్నావా పిచ్చిదానా? సైకలాజికల్‌గా సంతృప్తి కలుగుతుంది అంతే! తగ్గించేది ఆయనే ! ప్లేసిచో యిచ్చినా ఆయుర్దాయం ఉంటే లేచి కూర్చుంటాడు. అది లేకపోతే లక్షల యింజెక్షన్

యిచ్చినా లక్షణంగా ఛస్తాడు." వేదాంత దోరణిలో చెప్పాడు విచిత్రకుమార&.

" ఏమో నాకు భయంగా ఉంది మీకు బాగా ముదిరి పోయింది – వెంటనే వైద్యం చేయించాలి ! " విశారద చెప్పింది.

" ముందు నైవేధ్యం పెట్టు – ఆకలేస్తున్నది వైద్యం సంగతి తరువాత." చెప్పాడు విచిత్రకుమార&

విశారద వడ్డించి అతన్ని గమనిస్తూ నుల్చుంది. తిండి పుష్టిలో మార్పు లేదు. బాగానే లాగించేస్తున్నాడు – బావున్నవి లొట్టలేసుకుంటూ తింటున్నాడు. భోజనం అయింతర్వాత అన్నాడు.

" విశారదా ! లాకరులో అన్ని డాక్యుమెంట్లు పెట్టాను. డైరీలో మనకున్న ఆస్థి పాస్తుల వివరాలు రాశాను. ఎవడన్నా వచ్చి నేను బాకీ ఉన్నానని వసూలు చేస్తాడేమో జాగ్రత్త – ప్రామిసరీ నోటు అడిగి తీసుకో – అది నకిలీదో – ఒరిజినలో – డూప్లికేటో చూసుకో నా సంతకం నీకు తెల్సుగా – ఎవరిని పడితే వాడిని నమ్మద్దు. పిల్లల్ని ఏం చదివిస్తావు? బుజ్జిని మెడిసిను – చిట్టిని కంప్యూటరు ఇంజనీరింగు చేయించు. జాగ్రత్త ! నే వస్తాను." చెప్పులేసుకుని బయలు దేరాడు విచిత్రకుమార్.

" ఎక్కడికి వెళుతున్నారండీ ?" ఆశ్చర్యంగా అడిగింది.

" ఆఫీసుకు వెళుతున్నాను – "

" అయ్యో ! ఇవ్వాళ ఆదివారం కదండి – సెలవు!" చెప్పింది.

" అరే ! మర్చేపోయా – అయినా నేను చేయాల్సిన పన్లు చాలా ఉన్నాయి – మళ్లీ నేను పెండింగు పెట్టానని నా గురించి ఎవరూ తిట్టుకోకూడదు – పోయొస్తాలే – " అంటూ వెళ్ళి పోయాడు.

విశారద సోఫాలో వాలిపోయింది ఈ మధ్య ఇతని వాలకం మారి పోయింది ఏమిటి సంగతి అని ఆలోచిస్తూ.

ఎందుకైనా మంచిదని ఆయన వెళ్ళగానే అత్తామామలకు ఫోన్ ఫోన్ చేసింది. కుశల సమాచారాలు అయింతర్వాత విషయం వివరించింది విశారద.

" నువ్వేం గాభరా పడమాకు – వాడిపేరే అంత గదా – ఒక్కోప్పుడు వాడు

చేసే పన్లు విచిత్రంగా ఉంటాయి." అని కొట్టి పారేసింది అత్తగారు.

"వాడొట్టి తింగరి వెధవ ! తిక్క తిక్క చేష్టలు చేయడంలో తుగ్లక్ తమ్ముడు – కాకపోతే ఎప్పుడూ చేయడు – అమావాశ్యకు కాని – పూర్ణమి కాని చేస్తాడు." చెప్పాడు మామగారు.

" అయ్యో ! ఈ మధ్య అమావాశ్య లేదు – పున్నమి లేదండి – నా కదే భయంగా ఉంది మీ వాడికి కాని నాకు తెలియనివి కాని – మీకు తెలియనివి కాని జబ్బులేమన్నా చిన్నప్పటినుండి కాని ఉన్నాయాండి మామగారు."

" ఏదో వ్యవహారం ముదిరి నట్లుంది – రెండు రోజుల్లో వస్తాను – ఇక్కడ పన్లు పీకల్లోతుల్లో ఉన్నాయి – పూర్తిచేసుకొని వచ్చి తిక్కవెధవ తిక్క చక్కగా కుదురుస్తాను." అంటూ పెట్టేశాడు మామగారు.

విశారదకు కొంచెం ధైర్యం వచ్చింది – తిరిగి తనింటికి చేసింది

" అమ్మా ! ఇది విషయం నాకేదో భయంగా ఉంది."

" అయ్యో ! ఇంత చిన్నదానికే భయమెందుకే ! మీ నాన్నతో నేకాపురం చెయ్యడంలా – ఆయన వేసే పిచ్చి వేషాలకు ఇంకొకళ్ళయితేనా పాతికసార్లు విడాకులు యిచ్చి ఉండే వాళ్ళు – మొగ పీనుగలు అంతేనే – మనమే కాస్త సర్దుకు పోవాలి! ఈ వయసులో కూడ ఎన్ని వెకిలి వేషాలేస్తాడో మీ నాన్న – ఏదో పిల్లలున్నారని గౌరవించాలి ఈయన్ని – అంతే !" మద్దెల వచ్చి డోలుతో మొరపెట్టుకున్నట్లయింది.

" అది కాదమ్మా ! ఈయనలాంటి వాడితో నీ జీవితంలో కాపురం చేసి ఉండవు – భలే ఎక్సుపీరియన్సు"

" సరేలే నాకయింది ఒకటే పెళ్ళి – ఇష్టమున్నా కష్టమున్నా ఆ మొగుడు ముండాకొడుకుతోనే గుటుక్కుమనాలి మా తరం –" సిగ్గుపడింది తల్లి.

" నువ్వేదో ఉద్ధరిస్తావని నేను నీకు చెప్పడం లేదు – సడెన్‌గా షాక్ లాంటి న్యూస్ యిస్తే – ముందే మాకెందుకు చెప్పలేదని ఏడుస్తారని – మేం బ్రతికి లేమాని దెప్పి పోస్తారని చెప్పాను – అంతే ! నా సమస్య నేనే పరిష్కరించుకుంటాను – మీ జోక్యం అక్కరలేదు " కరుగ్గా సమాధానం చెప్పింది.

" అంతేనే విశారదా ! నీ తెలివి తేటల మీద నాకు నమ్మకం ఎక్కువుంది - కాకపోతే అల్లుడు లాంటి మంచి ముండా కొడుకు దొరకడం కష్టం - ఎన్ని పెళ్ళిళ్ళని చేసుకుంటాం? ఏ మొగాడ్ని చూసినా ఏమున్నది గర్వకారణం? " వాపోయింది.

" సరే ! సరే ! నువ్వు కాస్త ఆ సాహిత్య సభలకు - మహిళామండలులకు పోవడం తగ్గించు - అల్లుడికి తగ్గ అత్తగారు లాగా తయారవుతున్నావు - నాన్నను అడగలేదని చెప్పు" అంటూ విసురుగా పెట్టేసింది ఫోను.

సాయంత్రం వస్తూ వస్తూ తనెంబడ ఓ ఒంటిలింగం సొంఠి కొమ్ము లాంటి బాపనాడిని వెంట బెట్టుకు వచ్చాడు - విచిత్రకుమార్.

" మా ఆవిడ విశారద - ప్రస్తుతం నిండు ముత్తయిదువ !" పరిచయం చేశాడు అతనికి.

" పాపం ! పట్టుమని పాతిక దాటాయా?" సానుభూతి చూపించాడు.

" ఇంతకి తమరెవరో తెలుసుకోవచ్చా ?" అసహనంగా అడిగింది.

" నేను శివశంకర శాస్త్రిని ఈ ఊళ్ళో నాగురించి తెలియని వాళ్ళులేరు - సివిలు - క్రిమినలు రెంటూ చేస్తూ ఉంటాను." నవ్వాడు బొజ్జ వూపుకుంటూ శాస్త్రి.

"ఏమండీ ! లాయర్లతో మనకు పనేంటండి? కొంప దీసి విడాకులు గాని యిద్దామనుకుంటున్నారా?" కంగారు పడిపోయింది విశారద.

డబ్బాలో గులకరాళ్ళు వేసినట్లు నవ్వాడు శివశంకర శాస్త్రి.

" ఓహో ! నేను మీకంటికి అలా కనిపిస్తున్నానా - పదో క్లాసు పదిసార్లు ఫెయిలయ్యాను. నేను ప్రాక్టీసు చేసే సివిలు అంటే శుభకార్యాలు - పెళ్ళిళ్ళు పబ్బాలు - ఇంక క్రిమినలు అంటే తద్దినాలు - కర్మలు - లాంటివి - మామూలుగా చాలామంది బ్రాహ్మలు ఏదో ఒక దాంట్లోనే స్పెషలైజ్ చేస్తారు - నేనలా కాదు రెండింటిని లాగిస్తాను."

"కొంపదీసి పెళ్ళికి తద్దినానికి ఒకే మంత్రం చెబుతారా?" విచిత్రకుమార్‌కు అనుమానం వచ్చింది.

" అయ్యో ! ఎంత మాట ! మీరే చూస్తారుగా - మీ కర్మనే ఘనంగా జరిపిస్తానుగా - మంత్రంలో ఒక అపశబ్దం దొర్లితే నన్ను నిలదీయండి." రోషంగా

అన్నాడు శివశంకర శాస్త్రి.

" ఖర్మ ! ఖర్మ ! కర్మ అంటాడు - మంత్రం అంటాడు - నా కొక్క ముక్క అర్థం కాలేదు - " విశారద వణుకుతూ చెప్పింది.

" ఏం లేదే ! ఒంటరి ఆడదానివి నువ్వే. కష్టపడతావో ఈ కొత్త ఊర్లో అని ముందే పట్టుకొచ్చాను. ఈ ఊళ్లో ఓ పట్టాన అయ్యార్లు దొరకరు - కొండెక్కి కూర్చుంటారు అందుకని ముందే నీకు పరిచయం చేసి అన్నీ మాట్లాడుకుని కాస్త అడ్వాన్సు యిచ్చేస్తే - అవసరమయినప్పుడు ఒక్క సెల్ కొడితే నీకేం హెల్ లేకుండా వచ్చి అన్ని కార్యాలు చక్కబెడతాడు" వివరించాడు విచిత్రకుమార్.

" మీరేం బాధపడకండి అన్ని దగ్గరుండి నేను జరిపిస్తాను - స్మశానంలో కూడ ముందే మాట్లాడి ఏర్పాటు చేస్తాను. అన్నట్లు కుమార్ గారు మిమ్మల్ని కట్టెలతో కాల్చాలా - ఎలక్ట్రికల్ పొయ్యిలో కాల్చాలా - అదయితే నిమిషాల్లో బూడిదయి పోతారు - పాపం, మీ ఆవిడకి వెయిటింగు తగ్గుతుంది." సానుభూతితో అన్నాడు శివశంకర శాస్త్రి.

విషయం అర్థమయ్యేసరికి కాళికలా విరుచుకు పడింది విశారద.

" రేయ్ ! శాస్త్రీ నిన్ను చెప్పు తీసుకు కొడతా ! ఎంత మాటంటావురా - నా కళ్ళెదుటే మా ఆయన్ని అంత లేసి మాటలంటావా? ఆయనకు బుద్ధిలేక పోతే నీకన్నా బుద్ధి ఉండద్దు - చెట్టంత మనిషిని పట్టుకుని కాలుస్తావా? ఇప్పుడే పోలీసులకు ఫోన్ చేస్తాను." దగ్గరలో వున్న చీపురు చేతిలోకి తీసుకుని చిందులేసింది.

" అది కాదే విశారదా ! అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలు - అన్నీ ముందే మాట్లాడుకుంటే నాకు టెన్షన్ ఉండదు -" నచ్చచెప్పబోయాడు.

" కాస్త శాంతించడమ్మా ! నా జీవితంలో మీ ఆయనలాంటి కేసు మొదటిసారి చూస్తున్నాను. మహానుభావుడికి ఎంత ముందుచూపో! చావు అంటే చాలామంది భయపడి చచ్చేట్లు ఏడుస్తారు. కాని మీ ఆయన ధైర్యంగా నిలబడి తనకు జరుగబోయే కర్మలన్నీ - స్వయంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాడు." శివశంకర శాస్త్రి. భయపడుతూ చెప్పాడు. " ఆయనకు తగ్గ యిల్లాలిలాగా నువ్వు కూడ ధైర్యంగా వుండి హుందాగా

ప్రవర్తించాలమ్మా ! మొగుడు పోతే మళ్ళీ తెచ్చుకోవచ్చు – కాని ఒకసారి మనకు చెడ్డపేరొస్తే పోదు."

అరికాలి మంట నెత్తికెక్కింది విశారదకు.

చీపురు శాస్త్రి గారి వీపు మీద తిరగవేసింది. 'అయ్యో !' అంటూ అడ్డుకున్న విచిత్రకుమార్‌కు కూడ నాలుగు తగిలించింది అదే చేత్తో ఇద్దరూ అటూ ఇటూ పరుగెత్తారు.

" ఒసే ! నే చెప్పేది వినవే ! ఆయన తప్పులేదే ! నీమీద ప్రేమతోనే నేనీ పని చేశాను – ఈ ఊళ్ళో బ్రామ్మలు దొరకరే ! అందులో మంత్రం బేషుగ్గా చెప్పేవాళ్ళు అస్సలు దొరకరు." వాపోయాడు విచిత్రకుమార్.

" బాబూ ! నీ కర్మకు – నీ పెళ్ళాం ఖర్మకు రెండు దండాలు – నాదార్న నే పోతాను. ఎన్నో క్రిమినలు కేసులు చూశాను కాని – ఇటు వంటిది మటుకు ఎప్పుడూ ఎక్కడా కనీ వినీ ఎరుగలేదు." జరుకోబోయాడు.

" ఆగండి – ఆగండి – మీరు కూడ ఆవేశపడితే ఎలా – నన్ను గట్టెక్కించండి – నా కర్మగురించి చెప్పండి – ఎంత ఖర్చవుతుంది – నిత్య కర్మ చేస్తారా ఏంటి?" అడిగాడు.

" అయ్యో ! మీ కర్మ ఏంటో గాని – నా ఖర్మ కొద్దీ మీ ఆవిడ నాకు తద్దినం పెట్టేలాగుంది – బ్రతికుంటే బలుసాకు తిని బ్రతకచ్చు – కావాలంటే ఈ అపరకర్మలన్నీ వదిలేసి యల్లైసీ ఏజెంటుగా అన్నా బ్రతుకుతాను గాని – ఈ దెబ్బలు ఈ తిట్లు తినడం నా వల్లకాదు – మా ఆవిడకు తెలిస్తే రెచ్చి పోయి మళ్ళీ నన్ను తంతుంది." వల వల విలపించాడు శివశంకర శాస్త్రి.

చెట్టంత మనిషి ఏడుస్తూంటే విచిత్రంగా చూసింది విశారద.

" ఏవండీ ! ఇప్పటి కన్నా అస్సలు విషయం ఏంటో చెప్పండి – మీకు బ్రెయిన్ ట్యూమరు కదూ!" ఏడుస్తూ అడిగింది విశారద.

" కాదే – అవన్నీ కాదే – నేను గుండ్రాయిలా ఉన్నాను." ఖండించాడు.

" మరి ఎందుకండి పదే పదే చావుగురించి ఆలోచిస్తున్నారు?"

" ఎప్పటికైనా పోవాల్సిన వాళ్ళమే కదే! కలకాలం కలిసి ఉండలేంగా !"

" అయ్యా ! నాకు సెలవిప్పిస్తే - నేను మీరు కబురు చేసినప్పుడు వస్తాను -" భయపడ్తూ చెప్పాడు శివశంకర శాస్త్రి - కుర్చీలోంచి లేస్తూ .

" ఓ శాస్త్రీ నువ్వాగు - ఈయన తిక్క ఏంటో తెల్సుకుందాం !" కసిరింది విశారద. దాంతో బిక్క చచ్చి పోయి గమ్మున కూర్చున్నాడు.

" మనిషి జీవితం నీటిలో బుడగ లాంటిది - గాజు పలక లాంటిది - ఎప్పుడు పగుల్తుందో ఎవరికీ తెలీదు - కాకపోతే నా పూర్వపుణ్యం వలన నాకు కాస్త ముందుగా తెల్సింది - అంతే !" విచిత్రకుమార్ చెప్పాడు.

" ఏం తెల్సింది ? వంకాయ ?" కోపంగా అడిగింది.

" ఓ మహానుభావుడు నా జాతకం చూసి చెప్పాడు కొన్ని రోజుల్లోనే నేను మరణిస్తానని నాకు కనువిప్పు కలిగించాడు." విచిత్రకుమార్ చెప్పాడు.

" ఎవరా గాడిద !" కాళికలా మండి పడింది.

" అయ్యో ! కళ్ళు పోతాయే ! ఆయన సామాన్యుడు కాదు. ఇలా జాతకం చూస్తే అలా చెప్పేస్తాడు. అపర వరాహమహిలుడు." చెంపలేసుకున్నాడు భక్తితో విచిత్రకుమార్.

" మహానుభావా ! మీకు జాతకం లేదని పెళ్ళిలో కూడ యివ్వలేదుగా - ఇప్పుడు కొత్తగా ఎలా వచ్చింది?" అనుమానంగా అడిగింది.

" దాందేముంది లేండి - ఇప్పుడు కొత్తగా కంప్యూటర్ జాతకాలు పుట్టుకొచ్చాయి - ప్రతివూళ్ళో వెలుస్తున్నాయి. ఇలా బటను నొక్కితే మనం భవిష్యత్తు అరటిపండు వచ్చినట్లు చెబుతుంది." శివశంకర శాస్త్రి చెప్పాడు భయం తగ్గి.

" ఆయనే - నా పుట్టినతేది - సమయం యిస్తే చాలు చూసి చెప్పేస్తాడు కంప్యూటరులో వేయించుకుని. " విచిత్రకుమార్ చెప్పాడు.

" ఇంతకీ వాడిపేరేంటి - వూరేంటి - ఎక్కడుంటాడు? వాడి జాతకం

వాడికి తెల్సా - నా మొగుడికి చెప్పేముందు తన చావు తన కెప్పుడొస్తుందో తెల్సా?" ఒంటికాలిమీద లేచింది విశారద.

" అమ్మా ! అలా ఎగతాళి చెయ్యకూడదమ్మా ! శాస్త్రం శాస్త్రమే ! మనవాళ్ళు ఏ కంప్యూటర్లు - కాలిక్యులేటర్లు లేకుండా గ్రహణాలు - నక్షత్ర గమనాలు లెక్కలు వేశారా లేదా? జాతకాలు కూడా అంతే! వరాహమహిరుడు చెప్పినట్లే జాతకం జరిగిందా లేదా?" శివశంకర శాస్త్రి వత్తాసు పుచ్చుకున్నాడు.

" ఓయీ శాస్త్రీ నువ్వు వచ్చిన పని అయిందిగా - నీతో యింక అవసరం లేదు - ఇంకాసేపు వున్నావంటే నీ కర్మకు యింకోళ్ళని వెతుక్కోవాలి." అంటూ చీపురు కట్ట సంధించి మీదకురికింది. బ్రతుకు జీవుడా అంటూ చెప్పులు కూడ తొడుక్కోకుండా వీధిలో బడి పారిపోయాడు.

ఆపైన విశారద అతన్ని బుజ్జగించి - లాలించి - భయపెట్టి చిన్నగా రాత్రి పడగ్గదిలో విషయం రాబట్టింది అతన్నించి.

విచిత్రకుమార్ కెందుకో విచిత్రమయిన కోరిక కలిగింది. తనకు ప్రమోషన్ ఎపుడొస్తుందో తెల్సుకుందామని పించింది. ఆ సందర్భంలో తన కోలీగుల్ని విచారించాడు ఈ ఊళ్ళో జాతకాలు - ప్రశ్నలు ఎవరు బాగా చెబుతారని అందరూ ముక్త కంఠంతో గండభేరుండ శాస్త్రి పేరు చెప్పారు.

విచిత్రకుమార్ కష్టపడి ఆయన యిల్లు వెతుక్కుని వెళ్ళాడు - వచ్చిన విషయం చెప్పాడు. ఆరడుగుల ఆజానుభాహువు, రుద్రాక్షలు - విబూధి ధరించాడు.

" సరే, జాతకం తెచ్చావా బిడ్డా!" అడిగాడు గండభేరుండం

" లేదు స్వామీ - నా కెవరు రాయించలేదు." వినయంగా చెప్పాడు.

" మీరు బాపనోళ్ళు కాదా-జాతకాలు లేకుండా ఎలా పుట్టావురా కుంకా?"

" లేదు స్వామి - మా వాళ్ళకు నమ్మకాలు లేవు - అందుకని రాయించలేదు."

" మూర్ఖా ! కనీసం పుట్టినతేదీ గుర్తుందా?" హూంకరించాడు.

" నాకు గుర్తులేదు గాని - మా అమ్మ చెబుతూ ఉంటుంది." భయపడ్డాడు.

" అదే ఈ కాగితంలో రాసి తగలడు - " ఓ కాగితం యిచ్చాడు " నువ్వు పుట్టిన తేది - టైము - ఊరు రాసి ఏడు."

" రాశాను స్వామీ - కొంచెం నా ప్రమోషను ఎప్పుడొస్తుందో చెబితే !" నసిగాడు దోసిలి ఒగ్గి.

" ఆగరా బిడ్డా - వెంటనే కాదు - రేపురా - ఇవ్వాళ కంప్యూటరుకు సెలవు-" గండభేరుండం ఆ కాగితాన్ని ఓ డబ్బాలో వేస్తూ చెప్పాడు.

" రేపు ఈ టైంకు వస్తాను స్వామీ -" అంటూ వెళ్ళబోయాడు.

" ఆగరామూర్ఖా ! పైసలు తియ్యి - ఊరికే జాతకం యిస్తుందా కంప్యూటరు?" కోపంగా అరిచాడు గండభేరుండం

జేబులోంచి చిల్లర నాణేలు తీసిచ్చాడు విచిత్రకుమార్ !

అరచేతిలో వేసుకుని ఆ నాణాలు చూసి కోపంతో అతని మొహంమీద విసిరి కొట్టాడు గండభేరుండం

" ఒరే బిడ్డా ! నీ కంటికి నే ఎలా కనిపిస్తున్నారా? రోడ్డు మీద చిల్లర నాణాలు - కాగితాలు ఏరుకునే వెధవలా కనిపిస్తున్నానా?"

" ఓ పచ్చనోటిమ్మంటారా?" భయంగా అడిగాడు.

" జాతకం అంటే అడుక్కోవడ మనుకున్నావురా బిడ్డా - నేనేమన్నా చిలక జ్యోతిష్కుడినా? మినిష్టర్లు - యమ్మెల్యేలు వస్తేనే మాట్లడను. లక్ష లిచ్చి రమ్మన్న వాళ్ళింటికి పోను - ఆఫ్టరాల్ బచ్చాగాడివి నువ్వు వచ్చావని ఏదో చెబుదాంలే అనుకుంటే యిట్టా నఖరాలు చేస్తున్నావ్ !" మండి పడ్డాడు.

" స్వామీ - నా దగ్గర ఐదొందలు కంటే లేవు - ప్రస్తుతానికుంచండి - " వినయంగా చెప్పాడు ఐదొందల నోట్లు పళ్ళెంలో పెడ్తూ.

" ఇది కంప్యూటరుకు చెల్లు - మళ్ళీ రేపు పట్టుకురా బిడ్డా!" హూంకరించాడు.

మరునాడు బిక్కుబిక్కుమంటూ వెళ్లాడు.

ఓ నలుగురు అతని ముందు కూర్చున్నారు - వాళ్ళకు చెప్పి వాళ్ళను

పంపింతర్వాత ఇతని విషయానికొచ్చాడు.

" నీజాతకం భలేగుందిరా ! చాలా పైకి పోతావు."

" పైకి అంటే .." అనుమానంగా అడిగాడు.

" పైకి అంటే పైకే ! నువ్వు రాజకీయాల్లో దూరి ఉంటే మినిష్టరు అవుతావు కోట్లు సంపాదిస్తావు !" గండభేరుండం చెప్పాడు.

" అదేలా స్వామీ - నను ఓ గుమాస్తా గిరి వెలగ బెడుతున్నా - మీ దయవలన అడపాదడపా నాలుగు రాళ్ళు వస్తూ ఉంటాయి." చెప్పాడు.

" రాంగ్ సెలెక్షన్ ! నువ్వు దాన్ని వదిలేసి రాజకీయాల్లోకి రావాల్సింది - కాని బిడ్డా - ఒక్కటి గుర్తుపెట్టుకో నీకు గండం ఉంది. ఇది దాటితే నీ జీవతం బాగుంటుంది కొన్నాళ్ళు-"

" గండం అంటే ప్రమాదమా !"

" గండం అంటే గండమే ! అంతకు మించి చెప్పకూడదు."

" స్వామీ - భార్య బిడ్డలు కలవాడిని మీరే నన్ను రక్షించాలి. గండం అండే ఎప్పుడు - ఎలా ?" కాళ్ళ మీద పడ్డాడు.

" ప్రమాదం ఉందిరా మూర్ఖా ! అకాల మృత్యువు పొంచి వుంది".

" ఎప్పుడు ? ముచ్చెమటలు పోస్తూ వుంటే అడిగాడు.

" సరియైన టైంలో వచ్చావు కాబట్టి చెబుతున్నా ! ఈ నెల గడిస్తే కొంచెం ఫర్వాలేదు -"

" నెల అంటే ..ఎప్పుడు స్వామీ ?"

" ఈ రోజు నుండి ముప్పయి రోజుల్లోగా ... ఏదన్నా జరుగచ్చు -"

" బయటకు పోవడం మానుకోమంటారా?"

" విధిని తప్పించడం ఎవరి తరం? చావు రావాలంటే నువ్వు బజారుకు పోవాల్సి పని లేదు బాతురూంలో జారిపడి చావచ్చు - అందుకని ముందు జాగ్రత్తలు చేసుకో -ఏవన్నా రాతకోతలుంటే చూసుకో!" గండభేరుండం లేచాడు శిష్యులు వస్తే.

" స్వామీ - మార్గం లేదా?" కాళ్ళ మీద పడ్డాడు.

" మృత్యుంజయ మహామంత్రం జపించు నిరంతరం - నవగ్రహాలకు ముఖ్యంగా శనికి పూజలు జరిపించు - అవన్నీ మా శిష్య పరమాణువులు చెబుతారు - ముందు ఇంకో ఐదొందలు పెట్టు - మళ్ళీ వివరణగా మాట్లాడుకుందాం - ఆవతల మినిష్టరు నా కోసం వెయిట్ చేస్తున్నారు." గండభేరుండం చెప్పి వెళ్ళి పోయాడు.

అప్పటినుండి విచిత్రకుమార్ తనలోనే మదనపడటం సాగించాడు ముందు జాతకాలు జరుగుతాయా అని లెక్కపెట్టలేదు. తరువాత మిత్రులను వాకబు చేశాడు విషయం చెప్పకుండా గండభేరుండం చెప్పేవి జరుగుతాయా అని అడిగాడు.

చాలామంది ఆయనకు మంచి పేరుంది ఖచ్చితంగా జరుగుతాయని చెప్పాడు ఇలా ఊగిసలాటలో ఇరవై రోజులు గడిచిపోయాయి.

ఈలోగా అతనికి కొన్ని పీడకలలు వచ్చాయి.

గండభేరుండం చెప్పిన సమయం సమీపిస్తున్న కొద్దీ అతనికి ఆరాటం మొదలవుతుంది.... గుబులు తొలిచేస్తున్నది. ..

అందుకని ముందు జాగ్రత్త పడసాగాడు.

విశారద విషయం విని గలగల నవ్వింది. ధైర్యం చెప్పింది.

" ఎంత అమాయకులండి ! ఇంత చిన్న దానికి ఇలా అయిపోతారా! జాతకాలు ఎప్పుడూ నిజం కావు. పుట్టిన టైము కరెక్టుగా రాసుకునే మొగాడు లేడు. ప్రతిగడియారం తప్పుడు టైము చూపించేదే! పైగా ఎప్పుడు టైము నోటు చేసుకోవాలన్న దాంలో చాలా తేడాలున్నాయి. అంతే గాదు కొందరు కడుపులో బిడ్డ జీవం పోసుకోగానే జాతకం ఏర్పడుతుందంటారు - అయినా ఈ కలియుగంలో అంత కరెక్టుగా చెప్పేమొగాడు ఎవడున్నాడు?"

" కాదే - ఘండభేరుంఢం గురించి అందరూ ఘనంగా చెబ్తుంటారు."

" అయితే రేపు నేను కూడ మీతో ఆయన దగ్గరికి వస్తాను - తాడో పేడో తేల్చుకుంటాను." విశారద తెగవేసి చెప్పింది.

నిశ్చింతగా నిద్రపోయాడు మరునాడుదయం పోదామనుకుని.

కాని - మరునాడు ఊరు ఊరంతా బంద్ అయిపోయింది.

ప్రక్క గ్రామంలో ఫ్యాక్షన్ లీడరు కొడుకు విక్రమ్‌కుమార్‌ను ఎవరో బాంబు లేసి అతి దారుణంగా లేపేశారట. దాంతో అతని తాలుకు మనుషులు ఊళ్ళో దహన కాండలు - లూటీలు చేస్తూ ఉంటే పోలీసులు కర్ఫ్యూ విధించారు.

విచిత్రకుమార్ బయటకు పోవడానికి కూడ ఛాన్సురాలేదు.

అతని భయం గమనించి విశారద గండభేరుండాన్ని, ఫోనులో కాని - సెల్‌లో కాని కలవడానికి ప్రయత్నించింది. ల్యాండు ఫోను 'కుయ్' అని మొత్తు కుంటున్నది - సెల్ స్విచ్‌డ్ ఆఫ్ అని అఘోరిస్తున్నది.

అలా రెండు రోజులు ప్రయత్నించి విసిగి పోయింది.

మూడో రోజు ఊరులో కాస్త తెరిపి యిచ్చింది. పైగా ఆదివారం ఆరోజు గండభేరుండాన్ని వెతుక్కుంటూ వెళదామని తయారవుతున్నారు.

ఇంతలో వాళ్ళింటి ముందు ఓ కారొచ్చి ఆగింది.

ఆ కారులోంచి ఓ భారీ ఆకారం బురఖాలో దిగింది.

తమకు ముస్లిం స్నేహితులు ఎవరూ లేరే అని ఆశ్చర్యపోతూ ఉండగా ఆ బురఖా చరా చరా లోపలికి వచ్చేసింది - కారు వెళ్ళి పోయింది.

" క్యామేయ్ సాబ్ - క్యాకేలియే ఆప్ ఆయే ?" విశారద అడిగింది.

" అమ్మా ! ఇది విచిత్రకుమార్ ఇల్లేనా?" ఓ మొగగొంతు తెలుగులో మాట్లాడింది బురఖాలోంచి.

" అరే ! మీరు తెలుగువాళ్ళా - గొంతు రాచిందా? మా ఆయనే ఆ విచిత్రకుమార్ కూర్చోండి " విశారద ఆహ్వానించింది.

" అమ్మా ! మీ ఆయన్ను పిలవండమ్మా !" ప్రాధేయపడ్డాడు - లోపల బెడ్డు రూములో వున్న విచిత్రకుమార్ వాయిసు గుర్తుపట్టి రివ్వున బాణంలా దూసుకువచ్చి బురఖా కాళ్ళమీదపడ్డాడు.

విశారద విస్తు పోయింది ఈ వింత పరిణామానికి.

" అయ్యా ! విచిత్రకుమార్ ! నిజానికి నేను నీ కాళ్ళ మీద పడాలి - నువ్వు

కాదు." అంటూ గండభేరుండ ముసుగు బురఖా - తొలగించాడు.

విశారదకు అరికాలి మంట నెత్తిమీద కొచ్చింది అతన్ని చూడగానే

" గండభేరుండం శాస్త్రి మీరేనా !" నిప్పులు కురిపిస్తూ అడిగింది.

" అనే గదమ్మా నావెంట ఆ ఫ్యాక్షను వెధవలు పడింది - మీరే నన్ను రక్షించాలి - బాబూ ! విచిత్రకుమార్ - నా ప్రాణాలు నీ చేతిలో ఉన్నాయి. ఇవి చేతులు కావు కాళ్ళు అనుకో !" అతన్ని నలిపేస్తూ అన్నాడు గండభేరుండం

" స్వామీ - మీరు చెప్పిన గడువు గడుస్తున్న కొద్దీ నాకు దినదినగండం నూరేళ్ళ ఆయుష్షు లాగుంది - " వణికి పోతూ చెప్పాడు - విచిత్రకుమార్.

" అయినా ఎంత జాతకంలో వుంటే మాత్రం అంత యిదిగా చెప్పాలా శాస్త్రీ - ఎప్పుడో చచ్చేవాడు మీరు చెప్పే జాతకం విని యిప్పుడే గుండె ఆగి ఛస్తాడు . కొంచెం ముందు వెనుక చూసుకో నక్కర లేదా - అశుభాన్ని కొంచెం జాగ్రత్తగా తెల్సీతెలియనట్లు హెచ్చరించాలి గాని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పాలా? అందరికీ గుండె ధైర్యం ఉండదుగా - మీరు చెప్పింది విన్నప్పటి నుండి మాఆయన తిక్క తిక్కగా తిరుగుతున్నాడు ." విశారద ఒంటి కాలిమీద గండభేరుండం మీదకు లేచింది.

" అమ్మా బుద్ధొచ్చింది - ఈ గండం గడిస్తే నేను వేరే ఊరుకు పోయి బజ్జీలు అమ్ముకునన్నా బ్రతుకుతాను - మీ ఆయన్ను కాపాడ మని చెప్పిండి." చెట్టంత మనిషి చాపచుట్టలా కింద పడిపోయి రోదించాడు.

ఇద్దరూ బిత్తర పోయి అతన్ని ఓదార్చి అస్సలు సంగతి తెల్సుకున్నారు.

ఆ రోజున విక్రమ్‌కుమార్ - విచిత్రకుమార్ ఇద్దరూ జాతకం కోసం వచ్చారుట ఇద్దరి దగ్గరా తేదీలు రాసుకుని డబ్బాలో వేసుకున్నాట్ట. కాని శిష్యపరమాణువులు కంప్యూటర్‌లో ఎక్కించేటప్పుడు ఒక్కళ్ళది యింకొక్కళ్ళకు ఎక్కించారుట.

దాంతో ఈయన విక్రమకుమార్‌కు అద్భుతమైన జాతకం అని నిండు నూరేళ్ళు బతుకుతాడని చెప్పాట్ట.

కాని - ఓ మూడు రోజుల క్రిందట విక్రమ్ కుమార్ని ప్రత్యర్థులు మట్టు

బెట్టేసరికి – అతని తండ్రి అవక్రమ్ గార్కి తిక్కరేగి ఎవడ్రా నా కొడుకు జాతకం చెప్పింది వాడ్ని లేపేయండిరా అని ఆర్డర్లు జారీ చేశాట్ట. దాంతో అవక్రమ్ గ్యాంగు గండభేరుండాన్ని వెతుకుతున్నారట – ఈ విషయం తెల్సి అతను పారిపోయి తనకు తెల్సిన మినిష్టరు గారి దగ్గర తలదాచుకున్నాడుట.

“ ఇలా ఎంతకాలం దాక్కుంటావయ్యా – జరిగిన పొరపాటు చెప్పి – నచ్చచెబుదాం – ఆ విచిత్రకుమారును పట్టుకురా” అని మినిష్టరు గారు చెప్పారుట. అందుకని విచిత్రకుమార్ ను తీసికొని తోడుగా మినిష్టరు గారి దగ్గరకు పోయి – అవక్రమ్ ఫ్యాక్షను లీడరు గారితో రాజీ పడదామని నిర్ణయాని కొచ్చాడు.

“ అదమ్మా జరిగింది – నీట ముంచినా పాలముంచినా మీదే భారం !” భారీ కాయం గండభేరుండం ఆయాసపడ్తూ చెప్పాడు.

విశారదకు అతని వాలకం చూస్తే చిర్రెత్తుకొచ్చింది.

“ అదిగాదు గండభేరుండ శాస్త్రీ ! మీ జాతకాలు మీకు తెలియవు? మీ చావు ఎవరి చేతుల్లో – ఎప్పుడు వుందో తెలియదు. అందరికీ జాతకాలు చెబుతామని చెప్పి వాళ్ళ జేబులు కొల్లగొడుతున్నారు – డబ్బు పోతే పోయింది – వాళ్ళ మెదళ్ళు ఖరాబు చేస్తున్నారు – మీ లాంటి వాళ్ళకు యిలాంటి శిక్ష పడాల్సిందే – మా ఆయనరాడు – మీ దార్న మీరు పోండి...” మొహం వాచేట్లు చివాట్లు పెట్టింది.

“ అమ్మా తల్లీ, జగదంబా ! నువ్వే రక్షించాలి – కావాలంటే మీ కెంత కావాలన్నా డబ్బిస్తాను – బిడ్డా, భార్యలు కలవాడిని – నా చేతిలో ఏముందమ్మా ! అస్సలు జాతకాలకు పార్వతీ దేవి శాపం ఉండనే ఉందిగా – ఏదో పొట్ట తిప్పల కోసం గొప్పగా చెబుతాం – సాటి బ్రాహ్మడ్ని – కనికరించండి” అంటూ కాళ్ళు పట్టుకోబోయాడు.

“ విశారదా ! పాపం పెద్ద ముండావాడు కాళ్ళ బేరానికొచ్చాడుగా – వదిలేసెయ్యవే – నీ క్కావలసి డబ్బు గుంజుకో – ” విచిత్రకుమార్ చెప్పాడు.

“సరే ! ఏదో మా ఆయన చెబుతున్నాడు కాబట్టి – మీ వెంట మేమిద్దరం వస్తాం – ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకుని మసలుకోండి – మానసిక బలహీనుల్ని, దీనుల్ని

మీ జాతకాలతో విసిగించకండి- ” విశారద అభయమిచ్చింది.

“ హమ్మయ్య ! నాకు ధైర్యమొచ్చింది.... పదండి వెళదాం ” అంటూ కారు కోసం సెల్ చేశాడు గండభేరుండం.

“ ఒసే ! ఈ నెలరోజులు నేను ఎంత టెన్షన్‌లో చచ్చిపోయానే - ఓ నెల ఫారిన్ ట్రిప్పువేస్తే కాని నాకు మనశ్శాంతి దొరకదు. ” ఆనందంగా చెప్పాడు.

“ ఇంకేం, టికెట్లు బుక్ చేయించి - పై ఖర్చులకిస్తాడులేండి గండభేరుండ శాస్త్రి ” కిలకిల నవ్వుతూ అంది.

“ మహాప్రసాదం తల్లీ !” అంటూ చెంపలు వాయించుకున్నాడు గండభేరుండం.

ఇంతలో వీధి వాకిట్లో రివ్వున కారు వచ్చి వాలింది.

తలుపు తాళం పెట్టి ముగ్గురూ బయటకు వచ్చారు మినిష్టరును కలుద్దామని

ఊరు కొంచెం ప్రశాంతంగా ఉంది.

( నవ్య 11-01-2006)